# మూడో పెళ్లి

రచన :
శ్రీ ఇందల లింగమూర్తి

మూర్తికి పిల్లనిస్తామని అనేకులు రావటం, పోవడం జరుగుతునేవుంది. ఆ తల్లిదండ్రులకు అతని ప్రవర్తన ఏమీ నచ్చలేదు. ప్రతి మానవునకు జీవితంలో ప్రధాన ఘట్టం వివాహమని, ఆనందం కలిగించేది భార్య అని వానికేం తెల్సు, తెలుసుకుందామన్నా అతనికిప్పుడు లోటు అయితేగా!

◆ ◆ ◆

రానురాను మూర్తికి సత్యవతి యింటికి వెళ్ళే అవకాశం తప్పిపోయింది. తల్లిదండ్రులు పెండ్లిగురించి తీవ్రప్రయత్నంచేసి, కొడుకు అంగీకారం తెల్సుకోకుండానే, సంబంధం కుదుర్చుకొని తాంబూలాలు పుచ్చుకుని లగ్నంకూడా నిర్ణయించుకున్నారు.

ఆరోజు ఆదివారం అగుటచే మూర్తి ఇంటి వద్దనే వున్నాడు. సమయం దొరికిందికదా అని వివాహవిషయం అతనికి తెల్పారు తల్లిదండ్రులు. అతనికికూడా ఆ సంబంధం నచ్చినదే, 'పిల్లను నేను చూడవలసిన పనిలేదా' అని తల్లి అంటూండగానే వీధిలో జట్కావచ్చినిల్చుంది.

'నిన్ను తీసుకొని మా నాన్నగారు రమ్మన్నారు?' అంటూ ప్రసాద్ లోనికివస్తూ అన్నాడు. అప్పుడర్థమైంది విషయమంతా మూర్తికి.

పిల్లను చూచి తన సమ్మతం సంభంధీకులకు తెలియజేసి మూర్తి ఇల్లు చేరుకున్నాడు.

◆ ◆ ◆

'ఏమిటా శుభలేఖ!' అన్నాడు మూడో పెళ్లి చేసుకున్న కన్నయ్య.

'మీకు రైల్వేస్టేషనులో కనిపించి 'టికెట్ యిస్తుండే ఆయనకు ఎల్లుండి పెళ్ళిట....పెళ్లి' అన్నది సత్యవతి. వధువు ఎవరో?'

'కోడుగంటివారి వీధిలోవున్న రాణీ వెంకన్నగారి కూతురు సుశీలట అంది. బేష్, బేష్ చాలా బాగుంది వారి దాంపత్యం 'చిలకా గోరింకల్లా కుదిరింది' అన్నాడు రామయ్య.

'మనవలె ఎక్కడా వుండదులెండి'

'ఏమిటా వెటకారం? ఎవరు వెళ్ళాలి? అరవైఏండ్ల వధువు ఒకామె ఆడపిల్లను కన్నదట. భార్యా భర్తలు, బిడ్డా కులాసాగా వున్నారట, వెర్రిమొగమా, నీదంతా వేళాకోళం, వెక్కిరింతాను.

'మీరేవెళ్ళండి ఎవరికి తీరుబడి. పనిమనిషి నేనూ వుంటాం. మొన్నమనం వ్రాసిన వుత్తరం మావాళ్ళకు అందితే యీవేళ బండికి వస్తారు. నేను వెళ్లడానికి పురిటినెల కదూ?,

'సరే అవేళకు నేనే వెళ్తాలే' అంటూ వీధిలోనికి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

ఇంతలో బండి ఇంటిముందు ఆగింది. అత్తా మామలు బండిలోంచి దిగారు.

'దయచేయండి' అంటూ ఆహ్వానించాడు రామయ్య. సత్యవతినిచూసేసరికి తల్లిదండ్రులు పట్టలేనంత ఆనంద మొందారు. ఎంతైన కన్న మమకారం కూతురు కదా!

ఆస్తికిలోటా! దర్జాకులోటా! కాదూ పోదూ అంటే వయసుమళ్లింది, అంతేకదండీ అల్లుడికి.

ఏలాంటి పాడుపడిన ఇల్లయినా, ఇంట్లో పతి

మంది కలకల్లాడుతూ వుంటుంటే, అదొక శోభగా వుంటుంది.

◆ ◆ ◆

ఎన్ని ఎలా మారినా, సత్యవతీ, మూర్తీల కలయికమాత్రం దూరమైపోయింది.

ఆనాడు మూర్తియిల్లు పెండ్లిపందిర చాలా అలంకార శోభితంగా నిండివుంది. ఎక్కడ ఏది ఏలా వుంచాలో, అలాగే వుంచారు, వచ్చిన బంధువులకు మిత్రబృందములకు విడిది, భోజన ఫలహారాలు యధాతధంగా నెరవేర్చుతున్నారు.

ఆడ పెండ్లివారు యిష్టపడ్డంచేత మగపెళ్ళివారింట వివాహము ఏర్పాటు చేయబడింది.

అది పెండ్లిపందిరి. మంగళ వాద్యనాదాల మధ్య మూర్తిచే సుశీలమెడలో మంగళసూత్రధారణ చేయబడింది. తలంబ్రాలు వగైరా అట్టహాసాల్లో వుంది పెండ్లిపందిర.

ఇంతలో పదేళ్ల కుర్రాడొకడు రామయ్యగారెక్కడ వున్నారంటు వస్తున్నాడు. అక్కడున్న అందరిదృష్టి ఆపిల్లవానిమీద పోయింది. ఎందుకు, అంటే ఎందుకు? అని ప్రశ్నించుకున్నారు.

'ఏమీ లేదండి రామయ్యగారింట్లో పురుడు అయింది, కుర్రాడు పుట్టాడు, ఆ కబురు చెప్పి రామయ్యగారిని తీసుకుపోవడానికి వచ్చాను' అన్నాడు.

Grams: "IVRYNUTS" Phone: 2632

Jaga

షర్టులకు, బుష్‌షర్టులకు, కోట్లకు, ఫాంట్‌లకు
అత్యుత్తమమైన
ప్లాస్టిక్ బొత్తాములు
*ఎప్పుడూ నిలిచే రంగులు.
*మనోహరమైన ఆకృతి.
*చౌక అయినవి. చాలాకాలం మన్నేవి.

JBI

JAGA BUTTON Industries Ltd.
COIMBATORE.

జగా బటన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్.
మెట్టుపాలయం రోడ్ — కోయమత్తూరు.

అప్పుడు ఆ ప్రక్కనున్న రామయ్యగారి మీద అందరికళ్ళూ పడ్డాయి.

'ఎవరికి రామయ్యగారి కూతురికా! కోడలికా! పురుడువస్తే' అన్నారు కాలేజీకుర్రాళ్లు.

'తమకేనా? అబ్బాయి' అని పెద్దవాళ్లు.

అడిగినదానికి, ఆ, ఆ, అనడంతప్ప అతడేమీ చెప్పకుండానే వచ్చినకుర్రాడితో నిష్క్రమించాడు; మూర్తికి ఆ మాట విన్న దగ్గరనుండి. ముఖంలోవున్న పెళ్ళికళతగ్గింది.

రామయ్యగారు కొండంత ఆశతో ఇంట్లో ప్రవేశించారు. దగ్గరున్న సిద్ధాంతిగారిని రప్పించి పంచాంగం చూడమన్నారు.

చూస్తున్నాడు సిద్ధాంతి. ఆ నక్షత్రం లగ్నం తండ్రికి గండమని తెలుస్తోంది.

పురోహితుడు మౌనం వహించాడు.

'ఏమండి ఏమిటి ఎలావుంది' అడిగాడు రామయ్య.

'గొప్ప శాంతికావాలి' అన్నాడు.

'ఏమేమి అవుసరమో శలవిప్పించండి' అయితే బారసాల ఎప్పుడు నిర్ణయించుతారు.'

'పదకొండవరోజున, ఏమండి మామగారూ?' అక్కడున్న మామగారిని ప్రశ్నించాడు.

'అలాగే చేయాలి!'

'వినండి - గోదానం, భూదానం, సువర్ణదానం, కచ్చితంగావుండాలి, తక్కినసామాను జాబితా రాసా' అన్నాడు పురోహితుడు.

'చిత్తం అలాగే కానివ్వండి' అన్నాడు దిగులుగా రామయ్య. శెలవు తీసుకొంటూ పురోహితుడు వెళ్లిపోయాడు.

ఇంక రామయ్య బారసాలకోసం, తన వంశం నిలబెట్టిన కొడుకుకోసం కొండనుత్రవ్వి ఎలకను పట్టినంత ప్రయత్నం చేసాడు.

బంధు మిత్రులందరికీ ఆహ్వానాలు పంపించాడు.

తన కొడిక్కి ముద్దుల తండ్రిపేరు పెట్ట నిశ్చయించుకున్నాడు.

పదిరోజులు దొర్లిపోయినవి.

ఎల్లప్పుడూ మేలైన తిరుపూర్ గణేశ్ నిట్టింగ్ కంపెనీ బనియన్లనే వాడండి ॥




నాణ్యతకు, శుభ్రతకు, చిరకాలపు శ్రేష్టతకు పేరొందినది. ఇండియాలో తయారైనది.

శ్రీ గణేశ్ నిట్టింగ్ కంపెనీ.,

పోస్టుబాక్సు నెం. 43, తిరుపూరు. (S.I.)

పదకొండవ రోజున బంధుమిత్రులకు ఆనందంగా బారసాల అయింది. తన కింపుగా వుందని 'మూర్తి' అని పేరుపెట్టుకుంది సత్యవతి.

తన ఆచారమని తన తండ్రిపేరు వెంకటరామయ్య అన్నాడు రామయ్య. అక్కడున్న వారంతా బాగుందంటూ తల వూపారు.

పిల్లాడికి అయిదవనెల జొరబడేసరికి రామయ్యగారికి సడన్‌గా సన్నిపాత జ్వరం ఎటాక్ అయింది.

అత్తమామలు సత్యవతి, డాక్టర్లు ఎన్నో మందులు, సాధనాలు నెరవేర్చినారు. 20 దినాలు అలాగే వుంది.

ఇంక బ్రతకనని అతనికి అనుమానం కలిగి సత్యవతి పేరున తన యావదాస్తి వ్రాయించి వేసినాడు పాపం.

బల్లున తెల్లారింది.

రామయ్యగారి ముసలిప్రాణం గాలిలో కలిసిపోయింది. అత్త మామలు ఘొల్లుమన్నారు.

సత్యవతికూడా కన్నీరు కార్చింది.

అప్పుడు లోకం కళ్ళు తెరచింది, యిలాంటి 'మూడో పెళ్ళిళ్ళు' మూలంగా ఎందరెందరి యౌవనసుందరీమణులను విధవలుగా చేస్తుందో వూహించలేం. అందరి కళ్లట నీళ్లు కారాయి, రామయ్యగారి నూరేళ్లాయివు ఆవేళతో సరి. ఎందరెన్ననుకుంటే అతనికి వినుపిస్తుందా ఏమేనా?

తల్లిదండ్రులను తన వద్దే వుండిపోమని కోరింది. వారికేం? ఆటంకం చెప్పకుండా, కూతురుతో, మనుమడిని ఆడించుకుంటూ వుండిపోయినారు.

♦ ♦ ♦

ఈ బానిస దేశంలో దరిద్రులకు మరి కొందరు దరిద్రులు పుట్టడం వారిని పోషించలేక, వారలకు పెండ్లి చేయలేక, యిలాగే ఏదో ఓ లక్కీగా మూడో పెళ్లికి అతక కట్టడం.

ఏనుగు, దోమల, తేడాగా ఆ భార్యాభర్తలు వుండడం.

ఆ వృద్ధులకు వారిమీద అనుమానాలు కలిగి నానా యిక్కట్లు పెట్టడం, ఎన్ని పెట్టినా, యౌవనోద్రేకాన్ని ఎవరాపగలరు? కొంత కాలాన్కి అమ్మగార్లు పై దార్లకు పరారు చిత్తగించడం, జరుగుతుంది. నాటికీ, నేటికున్నూ.

పాపపుణ్యాలు విమర్శిస్తూ, కాలం యథావిధిగా నడుస్తోంది.

ఇప్పుడైనా లోకం గ్రహించి యిటువంటి 'మూడో పెళ్లిళ్లు' చేయకుండా వున్నట్లయితే స్త్రీల మాంగల్యబలం కొన్నాళ్లపాటు వుంటుంది' అంటూ వెళ్లిపోతూన్న రూపాయంత బొట్టు పెట్టుకున్న ఓ ముసలమ్మ అంది.

